క్లుప్తంగా

నేడు తాళ్లరేవులో రక్తదాన శిబిరం

తాళ్లరేవు: జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. స్థానిక పరదేశమ్మ వీధిలోని క్రీం కాం పౌండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం కాకినాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. రక్తదానం చేసిన వారికి రూ.లక్ష విలువైన ఇన్సూరెన్స్ సర్టిఫికెట్‌లు అందజేస్తారు.

వడ్రంగి మేస్త్రిల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం టౌన్: వడ్రంగి మేస్త్రిల సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కృషి చేయనుందని జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా సంఘ సమావేశానికి సూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించి ప్రసంగించారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భవానీ

తాళ్లరేవు: కాకినాడ మాధవపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న యండమూరి సత్యనారాయణకు గ్రామ వలంటీర్ బీర భవానీ శుక్రవారం పింఛన్ అందజేసింది. సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో భవానీ స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసింది.

తానా శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: వందే విశ్వ మాతరం 100 దేశాలలో శాంతి సద్భావన యాత్ర పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డీఆర్వో సత్తిబాబు ఆవిష్కరించారు. శత శతక కర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 దేశాలలో శాంతి సద్భావన యాత్ర జరుగుతుందన్నారు. ఈ నెల నవంబర్ 9న ఆఫ్రికాలోని బోట్‌స్వనలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈ యాత్ర ప్రారంభమవుతుందని కోనసీమ జిల్లా సమన్వయకర్త వీధి దుర్గారావు తెలిపారు. మట్టపర్తి నాగ రమేష్, చింతా రాంబాబు, మల్లాడి శ్రీనివాస్, ముమ్మిడివరపు వెంకటేష్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్‌కు లక్ష్మీశృతి

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న మాగాపు లక్ష్మీశృతి గుంటూరులో శనివారం జరగనున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ సెలక్షన్‌లో జిల్లా తరఫున హాజరుకానున్నదని పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో జిల్లా స్థాయిలో టేబుల్ టెన్నిస్ క్రీడలకు పాఠశాల నుంచి ఎంపిక అయిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: శిక్షణతో నైపుణ్య డ్రైవర్లను ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాల ద్వారా సిద్ధం చేస్తుందని, 8వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు అమలాపురం ఆర్టీసీ డీఎం చల్లా సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. 21 సంవత్సరాలు పూర్తయి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, డ్రైవింగ్‌లో ఒక సంవత్సరం అనుభవం కలిగిన అభ్యర్థులు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్ సెల్ నంబర్ 73829 09588లో సంప్రదించాలని డీఎం కోరారు.

గడువు కోరిన రీజెన్సీ

యానాం: రీజెన్సీ సిరామిక్స్ భారీ ఫ్యాక్టరీ ఆవరణలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు శుక్రవారం ఆ సంస్థ యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లగా సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం దీనిపై 15 రోజులు గడువు కోరడంతో అధికారులు దానికి అంగీకరించి వెనుదిరిగారు. గతంలో రీజెన్సీ సంస్థ అడ్మినిస్ట్రేటివ్ స్థలాన్ని లీజుకు తీసుకుందని, రెన్యువల్ చేసుకోలేదని అధికారులు అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ దండయపాణి, ఆర్ఐ రత్నరాణి, రషీద్, సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమావేశం

అమలాపురం రూరల్: ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం ఈదరపల్లి ఆటో యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. డివిజన్ స్థాయిలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా బొలిశెట్టి శంకర్ ఎన్నికయ్యారు.

జాతీయ అచీవ్‌మెంట్ టెస్టుకు 1,715 మంది

అమలాపురం రూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం జాతీయ ఎచీవ్‌మెంట్ టెస్టు నిర్వహించారు. 3,6,9 తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,715 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో సూర్యప్రకాశం తెలిపారు.

ఇక వివాదాలకు చెక్



డ్రోన్ ద్వారా రీ సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది



రీ సర్వే అనంతరం సరిహద్దుల్లో రాళ్లు పాతుతున్న సిబ్బంది

- గ్రామాల్లో పారదర్శకంగా జగనన్న భూ రీ సర్వే
- రైతులకు పక్కాగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

తాళ్లరేవు: భూముల రక్షణ, భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం పతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూ రీసర్వే కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. భూ ఆక్రమణలను నిరోధించడంతోపాటు భూ యజమానులకు వారి భూమిపై హక్కు కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని తీసుకువచ్చింది. దీంతో ఎన్నో ఏళ్లుగా భూ వివాదాలతో సతమతం అవుతున్న వారికి ఈ పథకం ఒక వరంలా మారింది. సుమారు 100 ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలనలో భూ సర్వే జరిగింది. అప్పటి ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ)ల ఆధారంగా, భూముల సర్వే కష్టతరమవుతుండడం, రికార్డుల్లో సమగ్రత లేకపోవడం అనేక సమస్యలకు దారితీస్తోంది. వాటిలోని లోపాలను ఆసరాగా తీసుకుని కొందరు తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడుతుండడంతో వివాదాలు నెలకొంటున్నాయి. ఆయా సమస్యలకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ఒక పరిష్కారంగా మారింది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంత రైతులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎంతో సమయం వెచ్చించాల్సి రావడంతోపాటు అనేక నిబంధనలు ఉండడంతో ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఆ ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రోన్, రోవర్ పరికరాల ద్వారా కచ్చితత్వంతో సర్వే చేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందజేస్తుంది. అధునాతన డ్రోన్ ద్వారా సర్వే చేసి ఆప్టికల్ రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ) మ్యాప్‌ను తయారు చేస్తారు. పంట పొలాలతో పాటు తోటలు, ఖాళీ స్థలాల సర్వే కూడా అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. ఓఆర్ఐ మ్యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో భూ సర్వేను నిర్వహించి తరువాత సరిహద్దులు నిర్ణయిస్తారు. గతంలో ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీ నంబర్లను కేటాయిస్తున్నారు. రైతుల సమక్షంలోనే ఈ సర్వే జరుగుతుండడంతో సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయి. రీ సర్వే పూర్తయిన వెంటనే ఆ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. భూ యజమానులకు పక్కాగా పాస్ పుస్తకాలను అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములను పరిరక్షించడంతోపాటు రైతుల మధ్య భూ వివాదాలకు తెరపడుతుంది. తాళ్లరేవు మండలంలో ఇప్పటి వరకు ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా ఇంజరం, ఉప్పంగల, జార్జీపేట, నీలపల్లి, సెకండ్ ఫేజ్‌లో చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం పంచాయతీలలో పూర్తయ్యింది. మూడవ ఫేజ్‌లో భాగంగా పిల్లంక, సుంకరపాలెం పంచాయతీలలో ప్రస్తుతం రీ సర్వే నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టడంతో భూ హక్కుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూ యజమానులు సహకరించాలి



ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులున్నా తొలగిపోతాయి. ముఖ్యంగా సరిహద్దు వివాదాలు లేకుండా పక్కాగా అత్యంత పారదర్శకంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. దీనికి భూ యజమానులందరూ సహకరించాలి.

– ఏ.వెంకట పద్మావతి, డిప్యూటీ తహసీల్దార్ (రీ సర్వే), తాళ్లరేవు మండలం

ఇది సత్ఫలితాలనిస్తుంది



ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా భూ వివాదాలు శాశ్వతంగా తొలగిపోతాయి. ఎంతోకాలంగా రైతులు సరిహద్దు వివాదాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రీ సర్వే పథకం సత్ఫలితాలనిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ఈ పథకాన్ని ప్రారంభించడంతో భూ వివాదాలు తొలగిపోనున్నాయి.

– పేర్ని కృష్ణ, రైతు, జార్జిపేట

గోడి బాలురు గురుకులంలో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ రఘురామ్, జేసీ నుపూర్

అల్లవరం: గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు గురుకులాన్ని సోషల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ జేవీ రఘురామ్‌తో కలసి జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అమలాపురం రూరల్ వన్నెచింతలపూడికి చెందిన న్యాయవాది పచ్చిమాల బాబ్జి బాలురు గురుకులంలో మౌలిక సౌకర్యాల కల్పన లోపించిందని హైకోర్టులో పిల్ వేశారు. ఈ నేపథ్యంలో జిల్లా జడ్జి ఇటీవల గురుకులాన్ని సందర్శించి నివేదికను రాష్ట్ర హైకోర్టుకు సీల్డ్ కవర్లో నివేదించారు. సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు అడిషనల్ డైరెక్టర్ రఘురామ్‌తో కలసి జేసీ నుపూర్ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాలురు గురుకులంలో టాయిలెట్స్, కిటికీలు, డోర్లు, స్విచ్‌బోర్డులు, విద్యార్థులు పడుకునేందుకు మంచాల అవసరాన్ని గుర్తించారు. వారు మాట్లాడుతూ గురుకులంలో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ. 84 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోతి లక్ష్మీదేవి, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ శ్యామ్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



విలసవిల్లిలో సంక్షేమ వివరాలను లబ్ధిదారునికి అందిస్తున్న శ్రీకాంత్

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- విలసవిల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ప్రజలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులతో కలసి శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. మగ్గం ఉన్న నేతన్నలకు ఏటా రూ.24 వేలు అందించి జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. సాంకేతిక లోపాలతో పథకాలు అందకపోతే సరి చూసి అందేలా చూడాలని ఉద్యోగులకు తెలిపారు. సర్పంచ్ సలాది ఊర్మిళా దేవి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్యల ఏసు, బళ్ల నాగసతీష్, బీర నరసింహమూర్తి, కర్రా చిన్నా పాల్గొన్నారు.

సముద్ర జలాలపై సంపూర్ణ హక్కు మత్స్యకారులదే



గచ్చకాయలపోరలో మహిళకు సంక్షేమ పథకాల వివరాలు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: అటవీ సంపదపై గిరిపుత్రులకు సంపూర్ణ హక్కు ఉన్నట్టే గంగమ్మను నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు సముద్ర జలాలపై పూర్తి హక్కు ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. చిర్రయానం, కాట్రేనికోన సర్పంచులు ఓలేటి మంగాదేవి, గంటి వెంకట సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ చమురు సంస్థల కార్యకలాపాలతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందన్నారు. పులస చేప గోదావరి జలాలలో కనుమరుగైందన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ పైపులైను పనులతో నష్టపోయిన లబ్ధిదారులకు మూడు విడతలుగా నష్టపరిహారం చెల్లించామని, నాలుగో విడత సొమ్ము రూ.69 వేలు ఈ నెల 21న తాళ్లరేవు బహిరంగ సభలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, కాశి హనుమంతరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపితే చర్యలు

తాళ్లరేవు: మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం జాతీయ రహదారి 216లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారం రోజులుగా నిర్వహించిన తనిఖీలలో 50కిపైగా కేసులు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి సుమారు రూ.3 లక్షల మేర జరిమానా విధించారన్నారు.

రక్షించేవాడు-శిక్షించేవాడు ఆ పరమ శివుడే

ఆధ్యాత్మిక వేత్త గరికపాటి



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో గరికపాటి నరసింహారావు ప్రవచనం

ఐ.పోలవరం: తప్పు చేస్తే శిక్షించేవాడు, అదే తప్పును ఒప్పుకొని క్షమించు దేవుడా అంటే రక్షించేవాడు కూడా సాక్షాత్తూ పరమశివుడు ఒక్కడే అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శతావధాని ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు అన్నారు. శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మంటపంలో కల్యాణ వీరేశ్వరుని వైభవంపై ప్రవచనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయం అత్యంత మహిమాన్వితమైనదని, ఇక్కడ కల్యాణం జరిపించుకొంటే వివాహం కాని అమ్మాయిలు, అబ్బాయిలకు సత్వరం వివాహం జరుగుతుందన్నారు. భగవంతుడు రక్షిస్తాడు అనుకోకూడదు, అవసరమైతే శిక్షిస్తాడు కూడా అన్నారు. ఈక్షేత్రంలో పూర్వం మునులు తపస్సు చేసుకొనేవారు కాబట్టి ఈ క్షేత్రం మునిమండలి వాడుకలో మురమళ్లగా మారిందన్నారు. తొలుత ఆలయ మర్యాదలతో అర్చక స్వామి యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో గరికపాటికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి స్వామి వారి చిత్రపటం, పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆర్‌జేసీ సురేష్‌బాబు, డీసీ విజయరాజు, ఏసీ ప్రసాద్ పాల్గొన్నారు. గరికపాటి ప్రవచనం వినేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



సభ్యులను విచారిస్తున్న డీపీఎం విజయ్‌కుమార్, స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి తదితరులు

అల్లవరం: మండలంలోని గూడాల గ్రామ సమైఖ్య సంఘంలో స్త్రీ నిధి, ఉన్నతి (ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్)లో నిధులు దుర్వినియోగంపై డీఆర్‌డీఏ డీపీఎం జి.విజయ్‌కుమార్, స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి శుక్రవారం విచారణ చేపట్టారు. గూడాలలోని సొసైటీ కార్యాలయంలో డ్వాక్రా సంఘ సభ్యుల సమక్షంలో గూడాల-3 యానిమేటర్ గోసంగి వెంకటరమణ నిధుల దుర్వినియోగంపై విచారించారు. గూడాల-3 కి సంబంధించిన 44 డ్వాక్రా సంఘాల్లో రూ.5.45 లక్షల దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంగా డీపీఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ గూడాల గ్రామ సమైఖ్య సంఘంలో 89 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వీటిలో 35 సంఘాలకు స్త్రీ నిధి నుంచి రుణాలు పొందారని తెలిపారు. ఉన్నతి ద్వారా 14 సంఘాల సభ్యులు రుణాలు తీసుకున్నారని తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన విచారణలో 11 సంఘాలకు చెందిన బ్యాంక్ స్టేట్‌మెంట్లు, రశీదుల పరిశీలించామన్నారు. మిగిలిన సంఘాలు మంగళవారం బహిరంగంగా విచారణ చేసి ఎంత మేర నిధులు దుర్వినియోగం అయ్యాయో వెల్లడిస్తామన్నారు. అయితే ఉన్నతిలో సంఘ సభ్యులకు తెలియకుండానే రుణాలు తీసుకున్నట్టు ఇటీవల యూనియన్ బ్యాంక్ మేనేజర్ సభ్యులకు నోటీసులు ఇవ్వడంతో నిధులు దుర్వినియోగాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, స్త్రీనిధి మేనేజర్ అనీష్‌గౌడ, ఏపీఎం సయ్యద్, యానిమేటర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

అమలాపురం రూరల్: రోళ్లపాలెంలో అగ్ని ప్రమాద బాధితుడు రాయుడు సత్తిబాబు కుటుంబ సభ్యులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీవీఎస్ మల్లిబాబు శుక్రవారం నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యం అందచేశారు. క్లబ్ కార్యదర్శి చిక్కాల సతీష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష

అమలాపురం రూరల్: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం భరోసాగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ పేర్కొన్నారు. సవర్పాపాలెం యూపీ పాఠశాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌తో కలిసి డాక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు. వైద్య విభాగాల పని తీరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ఐసీడీఎస్ శాఖ అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను డాక్టర్ శ్రీకాంత్ సందర్శించారు. సామూహిక సీమంతం నిర్వహించారు. సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ సత్తి నాగబాబు, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, కార్యదర్శి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మండల సమావేశంలో ఎంపీపీ గంగాభవానీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాభవానీ

ముమ్మిడివరం: వచ్చే రబీ సాగు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోలా గంగా భవానీ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత వ్యవసాయ శాఖ ఏఓ ప్రశాంతకుమార్ తమ శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు వివరిస్తుండగా వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, అయినాపురం గ్రామ సర్పంచ్ మోకా రామారావు జోక్యం చేసుకుని వచ్చే రబీకి కొన్ని ప్రాంతాలకు సాగునీటి సరఫరాకు అనుమతి లేదని ప్రచారం జరుగుతోందని దీనిపై అధికారులు వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ మౌనిక మాట్లాడుతూ రబీకి ఎంతవరకు అనుమతిస్తారో త్వరలో జరిగే ఇరిగేషన్ అధికారుల బోర్డు సమావేశంలో నిర్ధారణ అవుతుందన్నారు. ముమ్మిడివరం తాగునీటి ప్రాజెక్టు ద్వారా సరఫరా అవుతున్న నీటిని పక్కనే ఉన్న కాట్రేనికోన మండలానికి సరఫరా చేయడం వల్ల అయినాపురంలో మంచినీటి సమస్య తలెత్తుతుందని, ముమ్మిడివరం మండలానికి పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేసిన తరువాత పక్క మండలాలకు ఇవ్వాలని వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్ అన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానాజీ మాట్లాడుతూ మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న కాలనీలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం వల్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని ఈ విషయం పలు సమావేశంలో చర్చించినా ప్రయోజనం లేదని సీహెచ్ గున్నేపల్లి, కొమానపల్లి ఎంపీటీసీ సభ్యులు గొలకోటి వీరహనుమ పద్మజ, సాదనాల వీరనాగ సుబ్రమణ్యేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. గృహనిర్మాణ శాఖ ఏఈ వేణు మాట్లాడుతూ మండలంలో 14 లే అవుట్లలో 314 ఇళ్లు మంజూరు కాగా 122 మంది నిర్మించుకున్నారని, 62 మంది ఇంకా నిర్మాణం చేపట్టలేదని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. ప్రవేటు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొనే వారికి 116 మందికి మంజూరు కాగా 1,107 ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోకపోతే వాటిని రద్దు చేస్తామని ఎంపీడీఓ జె.రాంబాబు తెలిపారు. పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణానికి సర్పంచ్‌లు చొరవ చూపాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో కొమానపల్లి, అన్నంపల్లి, అనాతవరం సచివాలయాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ శివాజీ, విద్యాశాఖ అధికారి ఆర్.ఉదయభాస్కర్ శాఖల ప్రగతిని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, వైస్ ఎంపీపీ పాము నాగవేణి పాల్గొన్నారు.

అందాలొలికిన ఇంద్రచాపం



అమలాపురం టౌన్: నీలాకాశంలో సప్త వర్ణాలతో అమలాపురంలో శుక్రవారం ఉదయం కనిపించిన ఇంద్రధనుస్సు కొద్దిసేపు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది. స్థానిక ఉద్యాన వనం(పార్కు)నకు ఉదయం వచ్చే వాకర్స్ నింగిలోని ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించి ఆనందించారు. పార్కు ముఖ ద్వారంపై ధనుస్సు మాదిరిగా నింగిలో పరుచుకున్న ఆ దృశ్యాన్ని వాకర్స్ తమ వాకింగ్ మానేసి అదే పనిగా చూశారు. మబ్బుల మాటున సూర్యుడు...మధ్య మధ్యలో ఆకాశం మేఘావృత్తం... చిరు చినుకులతో ఉన్న వాతావరణంతో ఒక్కసారిగా నింగిలో తళుక్కుమన్న ఇంద్రధనుస్సు ఆ ఉద్యాన వనానికి కొత్త అందాన్ని తెచ్చింది.